తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
23-04-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 83
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

రూయ్.. రూయ్...మంటు

## మైనర్ల చేతుల్లో బైకులు



6

- రోడ్లపై పెరుగుతున్న ప్రమాదాలు
- లైసెన్స్ లేకుండా డ్రైవింగ్

**గుమ్మడిదల,ఏప్రిల్ 22 (సిరి న్యూస్) :**
గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలో మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు నడపడం రోజు రోజుకూ పెరుగుతోంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా రోడ్లపై బైక్‌లతో దూసుకెళ్తూ శబ్దాలు చేస్తూ తిరుగుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ఇది భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారి తీసే పరిస్థితిగా మారుతోంది.

## ఆగిన ఆర్టీసీ చక్రాలు




- డిపోలకే పరిమితమైన బస్సులు
- సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికుల సమ్మె
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో కొనసాగుతున్న స్ట్రైక్
- అరకొర బస్సులతో ప్రయాణికులకు పాట్లు
- డిపోల వద్ద పోలీసుల బందోబస్తు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆర్టీసీ పోరుబాట
- తెలంగాణ వ్యాప్తంగా నిలిచిన బస్సులు
- హైదరాబాద్ లో ప్రైవేట్ డ్రైవర్లతో బస్సులు నడిపిన యాజమాన్యం
- అడ్డుకున్న ఆర్టీసీ కార్మికులు డిపోల వద్ద ఉద్రిక్తత
- ఆర్టీసీ సమ్మె ప్రతిపక్షల కుట్ర
- సమ్మె ఆపాలని. కరిమికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి



3





కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే కార్మికులు అడుగుతున్నారు
: మాజీ మంత్రి హరీష్ రావు

3




## కేసీఆర్, హరీష్ రావుకు ఊరట

- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసికోవొద్దు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై హై కోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్**
కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఈరోజు బుధవారం కీలక మైన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మరియు ఇతరులకు ఊరటనిచ్చే విధంగా ఉంది.

**తీర్పులోని ప్రధానాంశాలు**
నివేదిక అమలుపై స్టే: పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకూడదని హైకోర్టు ఆదేశించింది. నివేదిక లోని అంశాలు

మిగతా 2వ పేజీలో..



కాంగ్రెస్ కుట్రలకు
### చెంపపెట్టు

- హైకోర్టు స్టేను స్వాగతిస్తున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

### హైకోర్టు తీర్పుతో ప్రభుత్వ వైఫల్యం బట్టబయలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



2

### కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్



2



## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు ఇకలేరు

- అనారోగ్యంతో బుధవారం కన్నుమూత

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్22:.**
మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు(90 )బుధవారం తుదిశ్వాస విడిచారు. గత 15 రోజులుగా అనారోగ్యకారణాలతో ఒక ప్రైవేట్ ఆసుపత్రి లో చేరారు. బుధవారం ఉదయం 11.30 నిమిషాలకు అయన తుదిశ్వాశ విడిచారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఒక వెలుగు వెలిగిన నేత నాదెండ్ల భాస్కర రావు . 1978 లో మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో అయన మంత్రిగా పనిచేసారు. అనంతరం

మిగతా 3వ పేజీలో..

## 29 డిమాండ్లు పరిష్కరించడానికి సిద్ధం

- మూడింటిపై చర్చిస్తున్నాం
- గ్రామీణ పేదలకు లైఫ్ లైన్ ఆర్టీసీ
- ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు
- సమ్మెను విరమించండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

2



## కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

- నిజాయతీ ఉంటే ముందుకు రండి
- బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్

2





### ఆర్టీసీ సమ్మెతో మెట్రోపై భారం

- బస్సులు నిలిచిపోవడంతో ఇబ్బందుల్లో ప్రయాణికులు
- రద్దీని దృష్టిలో పెట్టుకుని మెట్రో అదనపు సర్వీసులు
- ప్రధాన కారిడార్లలో రైళ్ల సంఖ్య పెంపు
- రాత్రి సర్వీసుల పొడిగింపుపై మెట్రో యాజమాన్యం పరిశీలన

3

## నేను టైరు మార్చాను .. స్పానర్ పట్టాను

- చేస్తున్న పనిలో బాధ్యతగా మెదలాలి.
- పుష్పాలగూడ సబ్స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన టీజీస్పీడీసీల్ సీఎండీ జితేష్ వి పాటిల్
- ఉద్యోగులతో మాటామంతి

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్ 22:**
సహజంగా ఒక విభాగం ఉన్నతాధికారి ఆకస్మికంగా తనిఖీ చేస్తే ఐతే బదిలీలు లేదా సస్పెన్షన్ కాకపోయినా కనీసం ఆగ్రహమైన వ్యక్తం చేస్తారు. కానీ ఆ అధికారి ఆలా కాదు ఆకస్మికంగా తనిఖీ చేసి

మిగతా 3వ పేజీలో..





3

ఓటుకు నోటు కేసు
## విచారణ వాయిదా

రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం కోర్టు

### బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రక్షాళన అవసరం

- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సీపీ సజ్జనార్ లేఖ



3

పోలీసు సిబ్బందికి మార్గదర్శి
### బిజినెస్ రూల్స్

- హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించిన డీజీపీ శివధర్ రెడ్డి




3

# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

- నిజాయతీ ఉంటే ముందుకు రండి
- బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదని పదేపదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే వెంటనే సీబీఐ విచారణకు ఒప్పుకోవాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆరఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని, భారీ ఆర్థిక దోపిడీ, కమీషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ప్రకటనలో ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతపై ఇప్పటికే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాలు కుంగిపోవడం, పంప్ హౌజ్‌లు దెబ్బతినడం వంటి సంఘటనలు యాదృచ్ఛికం కాదని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రాజెక్టులో జరిగిన పెద్ద ఎత్తున అవినీతికి నిదర్శనాలేనని పేర్కొన్నారు. ఆనాటి బీఆరఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత దెబ్బతిన్నదని, అదే విధంగా నిర్మించిన చెక్‌డ్యాములు కూడా కుప్పకూలిన ఘటనలు ప్రజల ముందు ఉన్న వాస్తవాలేనని మంత్రి గుర్తు చేశారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదన్నట్టు గోబెల్ ప్రచారానికి దిగడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, ఇది బీఆరఎస్ మాయాజాల రాజకీయాలే అని విమర్శించారు. నిజాన్ని దాచేందుకు ప్రచార యంత్రాంగాన్ని వినియోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. బీఆరఎస్ నాయకత్వం, ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, విచారణ నుంచి ఎందుకు తప్పించుకుంటున్నారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రాజెక్టుపై పూర్తిస్థాయి పారదర్శక విచారణ జరగడం ప్రజాస్వామ్యంలో కనీస బాధ్యత అని అన్నారు. ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.

# 29 డిమాండ్లు పరిష్కరించడానికి సిద్ధం


- మూడింటిపై చర్చిస్తున్నాం
- గ్రామీణ పేదలకు లైఫ్ లైన్ ఆర్టీసీ
- ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు
- సమ్మెను విరమించండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

పేద ప్రజల లైఫ్ లైన్ ఆర్టీసీ అని, సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలు చేయద్దని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మిక నాయకులను కోరారు. పేదల రవాణా వ్యవస్థ బాగుండాలి.. అందులో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగుల కుటుంబాలు బాగుండాలి అని అన్నారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మిగిలిన మూడింటిపై చర్చిస్తున్నామని ప్రభాకర్ తెలిపారు. తాము అధికారంలోకి రాగానే మొట్ట మొదటగా సీనియర్ ఐఏఎస్‌లతో కమిటీ వేశామని, అధికారుల కమిటీతో చర్చిస్తుండగానే సమ్మెకు పోతున్నామని కార్మిక నాయకులు మధ్యలో వెళ్లిపోవడం కుట్రలో భాగమేనని అన్నారు. ఇటీవల జగిత్యాల సభలో మహాలక్ష్మి ప్రయాణాన్ని కేసీఆర్ అవహేళనగా మాట్లాడారని, వెంటనే ఆర్టీసీపై కుట్రలో భాగంగానే గతంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్న హరీష్‌రావు సమ్మెకు కార్మికులను ప్రోత్సహించారని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి రాష్ట్రంలో లేరు.. ఆర్టీసీ డిమాండ్స్‌పై చర్చిస్తున్నామని అధికారులు చెప్పారు.. అయినా వినకుండానే ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడి సమ్మెకి వెళ్ళారని తెలిపారు. 2017 పీఆర్సీ ఇచ్చాం.. 2013 బాండ్స్ రూ.280 కోట్లు ఇచ్చాం.. 1134మందికి కారుణ్య నియామకాలు ఇచ్చాం.. పని భారం లేకుండా కార్మిక చట్టాల లోపలే చేశాం.. గతంలో 12 గంటలు వాహనం నడపడం వల్ల మరునాడు ఆఫ్ ఉండేది.. వాళ్ళు ఎలా అంటే అలా చేయడానికి సిద్ధంగా ఉన్నాం.. పని భారం లేకుండా చేయాలని చూస్తున్నాం.. తాము శ్రమ దోపిడీ చేయదలచుకోలేదు.. విలీనం, యూనియన్‌ల అంశాలపై ప్రభుత్వం పరిశీలిస్తోంది.. ప్రభుత్వం నెలకు ఆర్టీసీకి రూ.300 కోట్లు, అవసరమైనప్పుడు రూ.400 కోట్లు ఎంత అవసరం ఉంటే అంత ఇస్తున్నది.. సర్వీసు నుండి తొలగింపునకు గురైన 250 మందికిపైగా ఉద్యోగాలు ఇస్తున్నాం అని వివరించారు. మూడు సంవత్సరాల పీరియడ్‌ను రెండేళ్లకు తగ్గించాం అన్నారు. నిరసనలు చెప్పే వారు బస్ డిపోల్లో చేసుకోండి.. ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

తాము వచ్చాక మొదటగా కమిటీ వేశాం.. కమిటీకి నాలుగు వారాల సమయం అడిగాం.. ప్రభుత్వంతో కూర్చుని మాట్లాడాల్సిన అంశాలపై నాయకత్వం వహించిన వారు రిటైర్ అయిన వారు, ఉద్యోగాలు చేయని వారు ఉన్నారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించిందంటూ ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఎండీకి, ప్రిన్సిపల్ సెక్రటరీకి తెలియకుండా ఆదరాబాదరాగా విలీనం అంశాన్ని తెచ్చారని వెల్లడించారు. ఫైనాన్స్ మినిస్టర్ దగ్గరకు రండి కూర్చుని మాట్లాడదాం అని సూచించారు. మహాలక్ష్మి పథకం వచ్చినందున మీరు ఆర్టీసీపై కుట్రలు చేస్తున్నారంటూ రాజకీయ వ్యూహంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు నాయకత్వం వహిస్తున్న వారు సంస్థ పరిరక్షణ దృష్ట్యా, పేదల ప్రయోజనం దృష్ట్యా సమ్మె విరమించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. అధికారులు ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పోతున్నారని ఊహించలేదు.. డిప్యూటీ సీఎం చెన్నైలో ఉండడం వల్ల మాట్లాడలేకపోయాం... డిపో వారీగా సమీక్ష చేసి పని ఒత్తిడి ఉన్నచోట తగ్గించేందుకు సిద్ధం అన్నారు. తాము కిందిస్థాయి నుండి వచ్చాం.. ఆర్టీసీ కుటుంబాలతో 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో అనేకసార్లు ఇంటరాక్ట్ అయ్యాం.. ఉద్యోగస్థులు అక్కా చెల్లెలు.. అన్నదమ్ములు.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని కోరారు. తాము వచ్చిన తర్వాత 2800 బస్సులు కొనుగోలు చేశామని చెప్పారు. 29 అంశాలపై వెంటనే తాము టేబుల్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.. ఇప్పటికిప్పుడు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాం.. ఆర్థికపరమైన అంశాలను కూడా ప్రభుత్వం భారం మోయడానికి సిద్ధంగా ఉంది.. విలీనం, సంఘాల ఏర్పాటు, పీఆర్సీ కూడా ప్రభుత్వం పరిష్కరిస్తుంది.. మూడు సాంకేతిక అంశాలపై కమిటి నివేదిక అందిస్తుంది.. అధికారుల సంప్రదింపులు కొనసాగుతుండగానే కమిటీలోని వికాస్‌రాజ్, దాన కిషోర్, సందీప్ కుమార్ సుల్తానియా మీ అంశాలపై సానుకూల దృక్పథంతో ఉండే. ఒకటో తారీఖు జీతాలు ఇస్తున్నాం.. పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నాం అని చెప్పారు. సమ్మె దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని, హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్, మెట్రో సర్వీసులు ఫ్రీక్వెన్సీ పెంచాలని కోరామని చెప్పారు. ఈవీ బస్సులు 2018లో మొదలయ్యాయని, అది కేంద్ర ప్రభుత్వ పథకం అని, ఈవీ బస్సుల కారణంగా ఒక్క ఉద్యోగినీ తొలగించబోమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 14 వేల బస్సులు ఇస్తుండగా తెలంగాణకు రెండు వేల బస్సులు ఇస్తున్నారు.. కాలుష్యాన్ని తగ్గించడానికి వాటిని తీసుకొస్తున్నారు.. ఆర్టీసీ అనేక సంస్కరణలు తీసుకొస్తుంది.. బేషరతుగా సమ్మె విరమించండి.. మీ సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాం అని మరోసారి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం యూనియన్‌లను రద్దు చేసినప్పుడు ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, హరీష్ రావులు ఆర్టీసీ సమ్మెతో రాక్షసానందం పొందుతున్నారని వ్యాఖ్యానించారు. రవాణా శాఖ మంత్రిగా ఆర్టీసీ ఉద్యోగులను కోరుతున్నా.. మీ నిరసన ప్రజాస్వామికంగా ప్రభుత్వం గుర్తించే విధంగా ఉండాలన్నారు.




# కేసీఆర్, హరీష్ రావుకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

అమలుకు పనికిరావని (Inoperative) స్పష్టం చేసింది.

ప్రక్రియలో లోపాలు: కమిషన్ విచారణ జరిపేటప్పుడు సహజ న్యాయ సూత్రాలను పాటించలేదని, ముఖ్యంగా నిబంధన 8B ప్రకారం పిటిషనర్లకు సరైన నోటీసులు ఇవ్వకుండానే ప్రతికూల వ్యాఖ్యలు చేసిందని కోర్టు అభిప్రాయపడింది.

పిటిషనర్లకు ఊరట: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, మాజీ సీఎస్ ఎస్. కే. జోషి దాఖలు చేసిన పిటిషన్లపై ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. వీరిపై కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది.

కమిషన్ ఏర్పాటు సక్రమమే: అయితే, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ (G.O. Ms No. 6) చట్టబద్ధమేనని, దాని నియామకం చెల్లుతుందని హైకోర్టు సమర్థించింది. కానీ విచారణా విధానంలో జరిగిన లోపాల కారణంగా నివేదికను పక్కన పెట్టింది.

చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘ వాదనల తర్వాత ఈ నిర్ణయం వెలువరించింది. ప్రభుత్వం ఈ తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# హైకోర్టు తీర్పుతో ప్రభుత్వ వైఫల్యం బట్టబయలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని చట్టపరంగా, సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోరాదంటూ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రాగానే కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆరఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి పెద్దపెద్ద హామీలు ఇచ్చారు.. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావస్తున్నా ఏ ఒక్క అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టలేదు, చర్యలు తీసుకోలేదు అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల రూపాయల అవినీతి, ఫార్ములా వన్ రేస్ పేరుతో జరిగిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూకేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలలో అవినీతి, అక్రమాలు జరిగాయని, అవినీతి సొమ్మును కక్కిస్తానని పదేపదే సీఎం ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్క చర్య కూడా తీసుకోలేదని అన్నారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ఈ పార్టీలు 'దూప్ ఫైటింగ' చేస్తున్నాయన్నారు. రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు. అందుకే బీఆరఎస్ అక్రమాలపై చర్యలకు వెనుకాడుతోందన్నారు. ఎన్నికలకు ముందు, తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

## సుప్రీం కోర్టులో అప్పీల్ చేయాలి :రామచందర్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు అంశంలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలు పరిశీలిస్తే ఈ స్టే రావడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యం, తప్పిదాలేనని స్పష్టమవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. హైకోర్టు సూచించిన అంశాలు, వెల్లడించిన కారణాలు అన్నీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనే ఎత్తి చూపుతున్నాయన్నారు. పభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ విధివిధానాలు, విచారణలో నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడిందన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాల విషయంలో అసలు అవినీతిపరులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోందన్నారు. ఈ మొత్తం పరిణామానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అంటూ దోషులు ఎవరైనా వారికి చట్టపరంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

# కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలపై విచారణకు నియమించిన పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు స్టే ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఎండగట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదని.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని బీఆరఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాట ఇవాళ అక్షరాలా నిజమని తేలిపోయిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కా□□ నిబంధనలకు పాతరేశారని బీఆరఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన అన్నారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావుపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను మరమ్మతు చేసి రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని ఆయన హితవు పలికారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు.

# కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

- హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
- సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, ఏప్రిల్ 22:**

కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ `6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్ని చోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆరఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేందప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆరఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎసఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎసఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు ఫిల్లర్లు కాదని.. మొత్తం ఫౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే కార్మికులు అడుగుతున్నారు : మాజీ మంత్రి హరీష్ రావు

**తెలంగాణ బ్యూరో**



కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే తెలంగాణ ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. బుధవారం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు పలికారు ఈ సందర్భంగా అయన ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షం లో ఉండగా ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామన్నది మీరు, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తుస్తామన్నది మీరు మరి తెలంగాణాలో ఉన్నది మీ ప్రభుత్వమే కదా మరి ఎందుకు మీరిచ్చిన హామీను నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కార్మికులు అడిగింది కాంగ్రెస్ ఇచ్చిన హామీ మాత్రమే అది కూడా చేయలేక పోతే ఎలా అంటూ ఎద్దేవా చేసారు. మహాలక్ష్మి పతకం బకాయిలు 3000 కోట్లు పెండింగ్ లో ఉన్నాయ్.వెంటనే అవి విడుదల చేయాలనీ అయన డిమాండ్ చేసారు. కార్మికులకు డిఏ లు ఇవ్వరు. వేతన సవరణ చేయరు. అదనపు భారం మోపుతూ పైకి మాత్రం ఆర్టీసీ లాభాల్లో ఉందని చెప్పడం ఎంతవరకు సమంజసమని అయన అన్నారు.రెండున్నర ఏళ్ళు కార్మికులు ఓపిక పట్టారు ఇక ప్రభుత్వం చేయదని సమ్మె బాట పట్టారని ఆయన అన్నారు. ఇప్పటికైనా మొండి వైఖరి మాని కార్మికులతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని సమ్మె విరమింపజేయాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.



## ఆర్టీసీ సమ్మెతో మెట్రోపై భారం

- **బస్సులు నిలిచిపోవడంతో ఇబ్బందుల్లో ప్రయాణికులు**
- **రద్దీని దృష్టిలో పెట్టుకుని మెట్రో అదనపు సర్వీసులు**
- **ప్రధాన కారిడార్లలో రైళ్ల సంఖ్య పెంపు రాత్రి సర్వీసుల పొడిగింపుపై మెట్రో యాజమాన్యం పరిశీలన**

**హైదరాబాద్: ఏప్రిల్ 22**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె ప్రారంభించడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో నగర ప్రజలకు ఉపశమనంగా హైదరాబాద్ మెట్రో సంస్థ అదనపు సర్వీసులు నడిపే నిర్ణయం తీసుకుంది. పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ మార్గాల్లో రైళ్ల సంఖ్యను పెంచుతూ చర్యలు చేపట్టింది.ఆర్టీసీ సమ్మె ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్న హైదరాబాద్ నగరంలో ఉద్యోగులు, ఇతర పనుల కోసం బయలుదేరిన ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మియాపూర్-ఎల్బీనగర్, నాగోల్-రాయదుర్గం ప్రధాన కారిడార్లలో మెట్రో రైళ్ల రాకపోకలను పెంచారు. సాధారణంగా ఉండే విరామాల కంటే తక్కువ సమయంలో రైళ్లు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో స్టేషన్ల వద్ద పేరుకుపోతున్న రద్దీ తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదనంగా స్టేషన్ల వద్ద సిబ్బందిని పెంచి టికెట్ కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించే చర్యలు చేపట్టారు. సమ్మె కొనసాగుతున్న పరిస్థితుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైతే రాత్రి సర్వీసులను కూడా పొడిగించే అంశంపై మెట్రో యాజమాన్యం పరిశీలన కొనసాగిస్తోంది. అన్ని స్టేషన్లలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడంతో పాటు డిజిటల్ చెల్లింపులు వినియోగించాలని ప్రయాణికులకు సూచించారు. ప్రస్తుతం నగరంలో ప్రత్యామ్నాయ రవాణాగా మెట్రో కీలకంగా మారింది.

### నేను టైరు మార్చాను ..
## స్పానర్ పట్టాను

**మొదటిపేజీ తరువాయి**

ఉద్యోగులతో ఎలా ఉండాలో చర్చించారు. పనిలో తీసుకోవాల్సిన జాగ్రతలు తెలియజేసి నేను బాస్ ను కాను వ్యవస్థలో భాగం అని నిరూపించారు. బుధవారం టీజీస్పీడీసీల్ పరిధిలోని ఇబ్రహీంబాగ్ డివిజన్ లో ఉన్న పుప్పాలవాగు సబ్ స్టేషన్ ను టీజీస్పీడీసీల్ సీఎండీ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా సందర్శించారు. సబ్ స్టేషన్ ను సందర్శించి స్థానికంగా ఉన్న అధికారులతో ఒక సహా ఉద్యోగిలా ముచ్చటించారు. నేను ఒక ప్రయివేట్ ఆయిల్ కంపెనీ లో పనిచేసాను. అక్కడ టైర్ మార్చాను ఆయిల్ కూడా చేంజ్ చేసానని ఆయన అన్నారు. ఉద్యోగం అంటే మనం చేస్తున్న పనిలో బాధ్యతగా మెలగడమే అని అయన పేర్కొన్నారు. సబ్ స్టేషన్ లో టూల్స్ ఉన్నాయా? ఉంటే వాటిని వాడుతున్నారా? అని అయన సిబ్బందిని అడిగి తెల్సుకున్నారు. సబ్ స్టేషన్లలో చిన్న సమస్య ఉన్న వెంటనే సిబ్బంది స్పందించాలని సమస్య తీవ్రం అయ్యేవరకు చూడొద్దన్నారు. ఎప్పటికప్పుడు ఎర్తింగ్ పరిస్థితి చూడాలన్నారు ,


**విద్యుత్ శాఖలో అందుబాటులోకి ఏఐ టెక్నాలజీ**

విద్యుత్ శాఖలో ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి రానుందని టీజీస్పీడీసీల్ సీఎండీ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. టెక్నాలజీ వాడుకొని ప్రజలకు సేవలు మరింత వేగంగా అందించడమే లక్ష్యమన్నారు. కంపెనీ పరిధిలో ఎప్పటికప్పుడు అధికారులు సమస్యలపై స్పందిస్తున్నారని అయన పేర్కొన్నారు. అటు గ్రామీణం ఇటు పట్టణం అని తేడా లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే సంస్థ లక్ష్యమన్నారు. పిర్యాదు చేసిన వెంటనే సమస్య ఆధారంగా త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తున్నామని అయన పేర్కొన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా విద్యుత్ శాఖలో మరింత వేగవంతమైన సేవలు అందనున్నాయని అయన పేర్కొన్నారు.



# ఆగిన ఆర్టీసీ చక్రాలు

- **డిపోలకే పరిమితమైన బస్సులు**
- **సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికుల సమ్మె**
- **రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో కొనసాగుతున్న స్ట్రైక్**
- **అరకొర బస్సులతో ప్రయాణికులకు పాట్లు**
- **డిపోల వద్ద పోలీసుల బందోబస్తు**
- **ప్రభుత్వ నిర్లక్షంపై ఆర్టీసీ పోరుబాట**
- **తెలంగాణ వ్యాప్తంగా నిలిచిన బస్సులు**
- **హైదరాబాద్ లో ప్రైవేట్ డ్రైవర్లతో బస్సులు నడిపిన యాజమాన్యం**
- **అడ్డుకున్న ఆర్టీసీ కార్మికులు డిపోల వద్ద ఉద్రిక్తత**
- **ఆర్టీసీ సమ్మె ప్రతిపక్షల కుట్ర**
- **సమ్మె ఆపాలని. కరిమికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి**
- **డిమాండ్లలో 29 కి ఒకే అన్న మంత్రి**
- **ఆ మూడు నెరవేరుస్తేనే సమ్మె విరమిస్తామన్న ఆర్టీసీ జాక్**
- **స్తంభించిన రవాణా.. కొనసాగిన ప్రయివేట్ దోపిడీ**



**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్ 22:**

తెలంగాణలో ఆర్టీసీ అర్ధరాత్రి నుండి మొదలు పెట్టిన సమ్మె సంపూర్ణంగా కొనసాగింది. ఆయా జిల్లాలోని అన్ని డీపోలవద్ద అర్ధరాత్రి నుండే కార్మికులు బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కారించాలంటూ డిపోల ముందు ధర్నా చేపట్టారు. ఎక్కడికక్కడ బస్సులు నిలిచిపోవడం మూలంగా రాష్ట్రంలో రవాణా స్తంభించింది. కొన్ని చోట్ల ప్రయివేట్ బస్సులు నడపాలని యాజమాన్యం ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. పలు జిల్లాలో ప్రయివేట్ బస్సులను వెళ్లనీయకుండా డిపోల ఎదుటే కార్మికులు బైఠాయించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డిపో నుండి వెళ్తున్న ఒక ప్రయివేట్ బస్సు డ్రైవర్ పై కొందరు కార్మికులు వాటర్ బాటిల్ విసరగా అక్కడ కొంత ఉద్రికత్త చోటు చేసుకుంది.బస్సులు నడవక పోవడం మూలంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**ఇది ప్రతిపక్షాల కుట్ర**

ఆర్టీసీ సమ్మె ప్రతిపక్షాల కుట్ర అంటూ రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బుధవారం సమ్మె పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు అడిగిన 32 డిమాండ్లలో 29 ని పరిష్కరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఐనా సమ్మె చేస్తున్నారంటే ఇది ప్రతిపక్షాల కుట్రలతో జరుగుతున్న సమ్మె అని అయన ఆరోపించారు.మేము చర్చలకు తలుపులు తెరిచే ఉంచినా కార్మికులు మా ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ సమ్మె కు దిగడం సమంజసం కాదని అయన పేర్కొన్నారు. ఇది కార్మికుల శ్రేయస్సు కోరుకునే ప్రభుత్వం విలీనం పై కమిటి వేశాం 4 వారాల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పాము కానీ మీ వెనక ఉన్న శక్తుల ప్రోద్బలంతో మీరు సమ్మెను ఎంచుకున్నారు. మీ సమ్మె వల్ల మహిళలకు ఉచిత ప్రయాణం వ్యతిరేకిస్తున్నవారికి మేలు చేకూరుతుంది అని మంత్రి వ్యాఖ్యానించారు.ప్రజా ప్రయోజనార్థం ఇకనైనా చర్చలకు రావాలని అయన ఆర్టీసి కార్మికులను కోరారు.

**ఎవరో చెబితే వినడానికి మేము చిన్న పిల్లలమా: ఆర్టీసీ జాక్**

మా సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు.ఎన్నో విజ్ఞప్తులు చేసాం లెక్కలేనన్ని సార్లు అధికారులను మంత్రిని కలిసాం. విదిలేకే సమ్మె చేస్తున్నాం తప్ప ఎవరో చెబితే మేమెందుకు సమ్మె చేస్తామని ఆర్టీసీ జాక్ ఛైర్మెన్ వెంకన్న పేర్కొన్నారు. రాత్రి కూడా చర్చల్లో పాల్గొన్నాం అధికారులు వెళ్లిపోయాకే మేము వెళ్ళాం. సమస్యలు పరిష్కారం ఐతే మేమెందుకు సమ్మె చేస్తామని అయన అన్నారు. మా సమ్మెకు రాజకీయ పార్టీలతో సంబంధంలేదు. ఇది కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడ్డాక నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ చేస్తున్న పోరాటం మాత్రమే అని అయన పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం అసెంబ్లీలో ఆమోదం పొందింది. పక్క రాష్ట్రంలో అమలు జరిగింది మన రాష్ట్రంలో కమిటీ ఎందుకని అయన ప్రశ్నించారు. యూనియన్ గుర్తింపు సంఘము ఎన్నికలు సైతం నిర్వహించాల్సిందేనని అయన అన్నారు.

**ప్రయివేట్ దోపిడీ**

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెతో బస్సులు ఎక్కడికక్కడే ఆగిపోవడాన్ని ప్రయివేట్ క్యాష్ చేసుకుంది. చాల చోట్ల రెట్టింపు చార్జీలతో ప్రయివేట్ వాహనాలు ప్రయాణికులను తీసుకెళ్లాయి. సమ్మె మూలంగా ప్రయివేట్ వాహనాల్లో కిక్కిరిసిన ప్రయాణం తప్పలేదు.హైదరాబాద్ మహానగరంలో సైతం ఆటో వాలాలకు ఫుల్ డిమాండ్ వచ్చింది. ఇదే అదునుగా చాలాచోట్ల ఆటో వాళ్ళు సైతం ఎక్కువ డబ్బులు వసులు చేసారని ప్రయాణికులు వాపోయారు. ఏది ఏమైనా ఆర్టీసీ సమ్మె మొదటి రోజే సగటు ప్రయాణికునికి ఎన్నో విషయాలను నేర్పింది

**కిక్కిరిసిన మెట్రో ఎంఎంటీఎస్ లు**

హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజలు ప్రత్యామ్నాయం వెతుకుతున్నారు. కొంత మేర ప్రయివేటు బస్సులు నడుస్తున్నా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు.దింతో రోజువారీ ప్రయాణం తప్పని వారు మెట్రో రైలు ను ఆశ్రయిస్తున్నారు. దింతో బుధవారం మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. అదనంగా మరిన్ని ట్రిప్స్ నడిపేలా మెట్రో యాజమాన్యం కృషిచేస్తోంది.ఇందుకుతోడు ఎంఎంటీఎస్ మార్గాలు ఉన్నచోట సైతం జనం వాటిని ప్రయాణ మార్గాలుగా మలుచుకుంటున్నారు. ఇది కొంత మేరకు తప్పనిసరి వెళ్ళేవాళ్ళకు ఒక ప్రయాణ మార్గం అయ్యింది.

## బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రక్షాళన అవసరం

- **ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రాకు సీపీ సజ్జనార్ లేఖ**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:**



సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గోల్డెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

## పోలీసు సిబ్బందికి మార్గదర్శి 'బిజినెస్ రూల్స్'

- **హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించిన డీజీపీ శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:**

డీజీపీ కార్యాలయంలో సిబ్బంది విధుల నిర్వహణ, సర్వీసు నిబంధనలపై స్పష్టతనిచ్చే 'బిజినెస్ రూల్స్ అండ్ జనరల్ ఇన్‌స్ట్రక్షన్స్' బుక్‌లెట్‌ను డీజీపీ బి.శివధర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం పోలీసు అధికారులకు, సిబ్బందికి ఒక కరదీపికలా, మార్గదర్శిలా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారుల, సిబ్బంది సర్వీసు వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించే సమయంలో పాటించాల్సిన విధానాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు వివరించారు. తాను గతంలో పర్సనల్ అడిషనల్ డీజీపీగా ఉన్న సమయంలోనే ఈ తరహా నిబంధనల ఆవశ్యకతపై చర్చించానని, అందుకు అనుగుణంగానే సర్వీస్ రూల్స్ రివిజన్ కమిటీ చైర్మన్ వై.గంగాధర్ పలువురితో సంప్రదించి ఈ నియమాలను రూపొందించారని ఆయన పేర్కొన్నారు. నూతనంగా వెలువడుతున్న జీవోలు, మారుతున్న విధానాలకు అనుగుణంగా సిబ్బందికి అర్థమయ్యేలా దీనిని తీర్చిదిద్దిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ప్రశంసించారు. కమిటీ చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ సర్వీసు నిబంధనలపై క్షేత్రస్థాయిలో ఉద్యోగుల నుంచి సేకరించిన సమాచారం, ఎదుర్కొంటున్న విషయాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. డీజీపీ సూచనల మేరకు సిబ్బందికి ప్రయోజనం చేకూరేలా సమాచారాన్ని క్రోడీకరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, సీఐడి అడిషనల్ డీజీపీ చారుసిన్హా, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

- **రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం కోర్టు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:**



వోటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని జస్టిస్ విజయ్ బిష్ణోయ్ సభ్యుడిగా ఉన్న ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆరఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో వోటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కా□□ ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు ఇకలేరు

**మొదటిపేజీ తరువాయి**



జరిగిన రాజకీయ పరిమాణాల మూలంగా 1982 లో నందమూరి తారకరామారావు తో కలిసి తెలుగుదేశం పార్టీని స్థాపించారు.తెలుగుదేశం ప్రభుత్వంలో అయన కీలకంగా వ్యవరించారు.

**సంచలనాలకు మారుపేరు నాదెండ్ల**

1935 జూన్ 23 న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు విద్యార్థి దశనుండి రాజకీయాల్లో రాణించారు.197889 వరకు అయన ఎమ్మెల్యే కొనసాగారు.

**ఆగష్టు సంక్షోభంలో అనూహ్యంగా ముఖ్యమంత్రి !!**

నాదెండ్ల భాస్కరరావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటులో కీలకపాత్ర వ్యవహరించారు.ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయనకూడా షాడో ముఖ్యమంత్రిగా వ్యవహరించేవారు. 1984 ఆగస్టులో పట్టి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వైద్యం కోసం అమెరికా వెళ్లగా..తన ఎమ్మెల్యేల మద్దతుతో 1984 ఆగష్టు 16 నుండి సెప్టెంబర్ 16 వరకు 11 వ ముఖ్యమంత్రిగా కొనసాగారు. అనంతరం ఎన్టీఆర్ అమెరికానుండి తిరిగిరావడం , ప్రజల్లోకి వెళ్లడం మూలంగా తప్పనిసరి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి పీఠాన్ని వదులుకోవాల్సి వచ్చింది.అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి 1998 లో ఖమ్మం పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2019 లో బీజేపీ లో చేరినప్పటికీ వయోభారం మూలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ మంత్రి జనసేన కార్యదర్శి నాదెండ్ల మనోహర్ దివంగత ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కుమారుడే

**నేడు అంత్య క్రియలు.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు(90) అంత్యక్రియలు నేడు సాయంత్రం 4 గంటలకు పంజాగుట్ట స్మశాన వాటికలో జరుగుతాయని వారి కుటుంబసభ్యులు తెలిపారు.

**పలువురి సంతాపం.**

మాజీ ఏపీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్లు సంతాపం ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అయన మృతిపట్ల విచారం వ్యక్తం చేసారు. ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సైతం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసారు.

# అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా చేయాలి





- నిజాన్ని వెలికి తీయాలి అబద్ధాన్ని స్వాగతించవద్దు
- ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించాలి
- నిజమైన,అర్హత గల జర్నలిస్టులందరికి కార్డులు అందాలి
- డెస్క్ జర్నలిస్టుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా
- మెదక్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ ఏర్పాటు
- జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ఏప్రిల్,22(సిరిన్యూస్)**

నిజమైన,అర్హత గల జర్నలిస్టులకే అక్రిడేషన్ కార్డు అందాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్,కలెక్టర్ ప్రతిమా సింగ్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్లోని మీని సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, డిపిఆర్ఓ, అధికారులతో సమావేశం నిర్వహిం చారు.ముందుగా నూతనంగా నియామకమైన కమిటీ సభ్యులకు శుభా కాంక్షలు తెలియజేశారు. దరఖాస్తులు ఎన్ని వచ్చాయని దరఖాస్తు విధానాన్ని డిపిఆర్ఓ ను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..జిల్లాలో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు అక్రిడియేషన్ కార్డుల జారీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ జరగాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ఒక ప్రధాన వేదికగా ఉంటుందనీ పేర్కొన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేకుండా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందినీ ,అక్రిడిటేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా సమగ్రంగా పరిశీలించి, అర్హత ప్రమా ణాలు పూర్తిచేసిన అభ్యర్థులకు మాత్రమే కార్డులు జారీ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును నిబంధ నల ప్రకారం ఖచ్చితంగా పరిశీలించడంతో పాటు, అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలనీ కమిటీ సభ్యులకు సూచించారు.ఎటువంటి అనర్హులుకు కార్డులు జారీ కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అభ్యం తరాల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మీడియా ప్రతినిధులు సమర్పించే దరఖాస్తుల్లో వృత్తి సంబంధిత ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలనీ తేల్చి చెప్పారు.నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటమన్నారు.అక్రిడిటేషన్ కార్డులు పొందిన మీడియా ప్రతినిధులు తమ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ, సమాజానికి బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు.ప్రజలకు నిజమైన సమాచారం అందించడం, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్ధవంతంగా ప్రచారం చేయడం, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడం వంటి అంశాల్లో మీడియా తన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వర్తించాలనీ,జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలన్నారు.ప్రతి దశలో పారదర్శకతను పాటిస్తూ, ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ భూపాల్, కమిటీ సభ్యులు అశోక్, గోపాల్ గౌడ్, దేవరాజ్, శ్రీధర్, ఫరూక్ హుస్సేన్, శంకర్ దయాల్ చారి, సురేందర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస చారి, ఏపీఆర్ఓ బాబురావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కొంపల్లిలో పలు కాలనీలలో నెలకొన్న సమస్యలపై అరా

**కొంపల్లి.ఏప్రిల్.22(సిరి న్యూస్).**

కొంపల్లి డివిజన్ లో జయభేరి కాలనీ.ఉమామహేశ్వర కాలనీ.శ్రీనివాస నగర్ కాలనీలలో నెల కొన్న డ్రైనేజి మరియు రోడ్ల సమస్యలు, అలాగే ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల సమస్యలపై బుధవారం నాడు సైబరాబాద్ కమిషనర్ సృజనని స్థానిక సీనియర్ నాయకులు.మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తో కలిసి కొంపల్లి మాజీ సర్పంచ్.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దేవేందర్ కలిసి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.సమస్యలను పరిశీలించిన కమిషనర్ సృజన సంబంధిత మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.వీరితో పాటు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్.కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్,మాజీ కార్పొరేటర్ ఆగం పాండు,మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి,కావలి నవీన్ ముదిరాజ్, అంజనేయులు.తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పంచాయతీ అనుమతులు లేకుండా భారీ భవన నిర్మాణం

**వెల్దుర్తి ఏప్రిల్ 22,( సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన గ్రామ ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, పైగా పంచాయతీ సీసీ రోడ్డుపైనే కాంపౌండ్ వాల్ నిర్మించడం వంటి చర్యలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.గ్రామంలో భారీగా నిర్మించిన భవనం కేవలం అనుమతుల్లేకుండా మాత్రమే కాకుండా, చుట్టుపక్కల ప్రజల సౌకర్యాలను కూడా పట్టించుకోకుండా నిర్మించబడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కరెంటు వైర్లకు కూడా అంతరాయం కలిగేలా నిర్మాణం జరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ముఖ్యంగా, స్థానికుడు రఘువీర్ పంతులు కి చెందిన సుమారు 30 గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులు ఐదుసార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడం గమనార్హం. దీంతో బాధితుడు మళ్లీ ఫిర్యాదు చేయడంతో డీఎల్పీవో యాదయ్య సంఘటన స్థలాన్ని సందర్శించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, "నడి రోడ్డులో ఇల్లు నిర్మించడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ప్రజల సౌకర్యాలు, భద్రత దృష్ట్యా ఇలాంటి నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నిబంధనలు ఉల్లంఘించిన ఇంటి యజమాని పై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో శాంతి, క్రమశిక్షణ కొనసాగాలంటే ఇలాంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం అవసరం.అని గ్రామస్తులు హెచ్చరించారు.





# వి ఏ ఓ భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్

**వెల్దుర్తి ఏప్రిల్ 22, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించబోతున్న వి ఏ ఓ భవనానికి బుధవారం ఆరెగూడెం గ్రామ సర్పంచ్ వెన్నవరం చైతన్య హానుమంత్ రెడ్డి గ్రామ వార్డు సభ్యులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను గెలిపించిన గ్రామస్తులకు ఎల్లవేళలా అందుబాటులోనే ఉంటానని గ్రామంలో సిసి రోడ్ నిర్మాణాలు అలాగే డ్రైనేజీ వ్యవస్థను ప్రభుత్వ సహాయ సహకారాలతో తొందర్లోనే నిర్మిస్తానని, గ్రామపంచాయతీ భవన నిర్మాణం కూడా తొందర్లోనే పూర్తవుతుందని ఆమె తెలిపారు. పత్తి శనివారం గ్రామ శివారులో జరుగుతున్న గొర్ల సంత కూడా కావలసిన సదుపాయాలు అందజేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉప సర్పంచ్ గ్రామ మాజీ సర్పంచ్ శేఖర్, నాయకులు హనుమంత్ రెడ్డి, రాజిరెడ్డి, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## దళితరత్న అవార్డు గ్రహీతను సన్మానించిన ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్



**కొంపల్లి.ఏప్రిల్.22(సిరి న్యూస్).**

బాబు జగ్జీవన్ రావ్ మరియు అంబేత్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కొంపల్లి నివాసి ఎర్రోళ్ల కృష్ణకు దళిత రత్న అవార్డు దక్కింది.ఇందులో భాగంగాబుధవారం నాడు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ చేతుల మీదగా దళిత రత్న అవార్డు గ్రహీత ఎర్రోళ్ల కృష్ణను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి అంబేత్కర్ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ తో పాటు సంఘం సభ్యులు మరియు పలువురు పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అంతే కాకుండా పేద ప్రజలకు అండగా ఉంటూ పిల్లల పేద చదువులకు తోడ్పడాలని అన్నారు.చక్కటి కార్యక్రమాని నిర్వహించి అంబేత్కర్ ఆశయసాధనలను ప్రజలకు వివరించాలని రానున్న రోజుల్లో కొంపల్లిలో చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలనీ దానికిగాను నేను కూడా పాల్గొంటానని అన్నారు.

## మల్లికార్జున కర్గే దిష్టిబొమ్మను తగలబెట్టిన కొంపల్లి బిజెపి నాయకులు



**కొంపల్లి.ఏప్రిల్.22(సిరి న్యూస్).**

భారత ప్రధాని నరేంద్ర మోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆలిండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున కర్గేకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ కొంపల్లి ఆధ్వర్యంలో బుధవారం నాడు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంలో మల్లికార్జున్ కర్గే మరియు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక నినాదాలు చేస్తూ మల్లికార్జున్ కరిగే దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కొంపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షులు సతీసాగర్ మాట్లాడుతూ భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలిపే ప్రయత్నంలో అనుక్షణం కృషి చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్లికార్జున వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి,రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరిత రావు.బిజెపి నాయకులు శివాజీ రాజు, నరసింహ , చక్రధర్, మాధురి, మధు, అశోక్, మహేందర్, అశ్విన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# తీర్థ యాత్రలకు వెళ్లి.. జోగిపేటకు శవమై

**మాజీ సొసైటీ వైస్ ఛైర్మన్ గుండెపోటుతో మృతి**

**మధ్యప్రదేశ్ నుంచి జోగిపేట కు మృతదేహం తరలింపు**

**సంతాపం తెలిపిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహ**

**జోగిపేట, ఏప్రిల్ 22, (సిరి న్యూస్):**



తీర్థ యాత్రలకు వెళ్లి శవమై ఇంటికి తిరిగి వస్తున్న విషయాన్ని పట్టణ ప్రజలు , బంధువులు జీర్ణించుకోలేక పోతున్నారు. అందోలు సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీరశైవ లింగాయత్ జిల్లా నాయకుడు సులుగంటి సత్యవ్రత్(68) గుండె పోటుతో బుధవారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈనెల 9వ తేదిన కాశీ, అయోధ్య తీర్థయాత్రలకు కుటుంబ సభ్యులతో కలిసి రైలులో బయలుదేరి వెళ్లారు. యాత్రలు పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలో హఠాత్తుగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో రైలులోనే గుండె పోటు రావడంతో అక్కడికక్కడే కుప్ప కూలిపోయి నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడైన సులుగంటి చంద్రప్ప కుమారుడైన సత్యవ్రత్ చనిపోయిన విషయం పట్టణంలో దాహనంలా వ్యాపించింది. సత్యవ్రత్ గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ ఆయన మృతదేహాన్ని జోగిపేటకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సత్యవ్రత్ మృతి పట్ల మంత్రి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసారు. గురువారం జోగిపేటలో అంత్యక్రియలు జరుగనున్నట్లు బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

## భావోద్వేగంతో కథనం చెప్పాలి

కార్పొరేట్ శిక్షకురాలు జూజర్



**రామచంద్రపురం,(పటాన్చెరు), ఏప్రిల్ 22, (సిరి న్యూస్):**

ప్రభావవంతమైన కథనం భావోద్వేగపరంగా అనుసంధానం కావాలని కార్పొరేట్ శిక్షకురాలు జూజర్ సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని విద్యా ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఆధ్వర్యంలో బుధవారం 'సంభాషణ, ప్రభావం' అంశంపై ఒకరోజు కార్యశాలను నిర్వహించారు.ఈ సందర్భంగా జూజర్ మాట్లాడుతూ, సమర్థవంతమైన సంభాషణకు లక్ష్యం, సభ్యులు, మనస్తత్వం, పద్ధతి అనే నాలుగు అంశాలు కీలకమన్నారు. కథాకథనాన్ని శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనంగా పేర్కొంటూ భావవ్యక్తీకరణ, సహానుభూతి, తర్కం సమతుల్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులకు కథన నిర్మాణం, సమర్థ వంతమైన బోధన పద్ధతులు, విద్యార్థులను ఆకట్టుకునే విధానాలపై మార్గదర్శనం చేశారు. కార్యశాలను సీఏఐఏకు చెందిన మోసెస్ కోటికెలా సమన్వయం చేశారు.

## భారతినగర్ లో జలమండలి ఈడీ పర్యటన

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



**రామచంద్రపురం, ఏప్రిల్ 22, (సిరి న్యూస్):**

భారతినగర్ డివిజన్‌లో జలమండలి సైబరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ పర్యటించి పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫెన్సింగ్ ఏరియాలో ప్రధాన పైప్‌లైన్‌ను స్లోప్స్‌కు అనుగుణంగా మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. బీడీఎల్ కాలనీలో పైప్‌లైన్ కొరతతో నిలిచిపోయిన పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. హెచ్ఐజీ కాలనీలో బల్క్ కనెక్షన్‌లను వ్యక్తిగత కనెక్షన్‌లుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.అనంతరం రామచంద్ర రెడ్డి నగర్ కాలనీ, నేషనల్ హైవే వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించి, కాలనీ లైన్లను హైవే మెయిన్ హోల్స్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. రూ.40 లక్షల నిధులను జలమండలి శాఖకు బదిలీ చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టత

కాలుజారి పడడంతో స్వల్ప గాయం

వారం రోజుల విశ్రాంతి సూచించిన వైద్యులు

**రామచంద్రపురం,(పటాన్చెరు), ఏప్రిల్ 22, (సిరి న్యూస్):**



పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తాను ఆరోగ్యంగానే ఉన్నానని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బాత్రూమ్ నుంచి బయటకు వస్తుండగా కాలుజారి పడటంతో స్వల్ప గాయం అయినట్లు తెలిపారు.వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. తన ఆరోగ్యంపై కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన విజ్ఞప్తి చేశారు.భగవంతుడి కృపతో, పటాన్చెరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో త్వరలోనే తిరిగి ప్రజాసేవలో పాల్గొంటానని గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

## కానుకుంట పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

**గుమ్మడిదల, ఏప్రిల్ 22( సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీడ్ వర్క్స్ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. సంస్థ నిర్వహణ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ వెంకట్రామ్, సామాజిక బాధ్యత విభాగ అధిపతి జీ చంద్ర సింగ్, సాంకేతిక విభాగ, సీటీఓ అధిపతి డాక్టర్ రాజేంద్ర సింగ్, పరిశోధన శాస్త్రవేత్తలు ఫెర్నాండేజ్ మోసెస్, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సామాజిక బాధ్యత బృంద సభ్యులు అశ్లేష, చందన, సాయి శ్యామల కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నీరజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థలు తమ సామాజిక బాధ్యతగా నిధులు అందించడం ఎంతో అభినందనీయమని, విద్యార్థుల ప్రగతికి ఇటువంటి సహకారం మరింత ప్రేరణనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమ్మెతో సమస్యలు సృష్టించవద్దు.!

- ఆర్టీసీ సమ్మె దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మీడియా సమావేశం
- ప్రైవేట్ వాహనదారులు ఎక్కువ ఛార్జ్ చేస్తే చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్

**మెదక్ ఏప్రిల్,22(సిరిన్యూస్)**





ఆర్టీసీ సమ్మె దృశ్య జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ప్రైవేట్ వాహనదారులు ఎక్కువ ఛార్జ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ నంబర్ 9391942254 ఏర్పాటు చేశాం అని ,ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె వల్ల జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు.జిల్లాలోని మెదక్, నర్సాపూర్ బస్ డిపోల నుంచి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.మెదక్ నుంచి 100, నర్సాపూర్ నుంచి 34 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.రెండు బస్ డిపోల పరిధిలో కొత్తగ కండక్టర్ లను నియమిస్తున్నానని, అదే విధంగా గతంలో ఆర్టీసీ డ్రైవర్ ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిని పరిశీలించి వారి సేవలు వినియోగించుకుంటున్నా మన్నారు. పోలీస్ , రెవెన్యూ, రవాణా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రైవేట్ స్కూల్స్, కంపెనీ ల వారిని సహకరించాలని కోరడం జరిగిందని వారి సహకారంతో ప్రజల అవసరాల మేరకు వారికి బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పటు చేశామన్నారు.ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎవరైనా ప్రైవేట్ వాహనదారులు అధిక ఛార్జీ లు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై పాటించాలి





- గ్రామంలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా
- "ఆరైవ్ అలైవ్ "కార్యక్రమంలో అవగాహన కల్పించిన ఎస్ఐ సోమేశ్వరీ

**కొండాపూర్ ఏప్రిల్ 22 (సిరిన్యూస్)**

మండల పరిధిలోని మన్ సాన్ పల్లిలో బుధవారం "ఆరైవ్ అలైవ్" కార్యక్రమంలో కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరీ ట్రాఫిక్ నియమాలపై పాటించాలనీ గ్రామస్తులకు అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్ రాంచెంద్రారెడ్డి, పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో గ్రామానికి గట్టి భద్రత ఉంటుందని,రోడ్డు భద్రత తీసుకోవలసిన నియమాలను వివరించారు.హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై పలుసూచనలు చేశారు. అలాగే, ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. గ్రామస్థులు, యువకులు, పెద్దలు వాహనదారులు పాల్గొని ట్రాఫిక్ భద్రతపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని గ్రామ సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, ఉప సర్పంచ్ శివ శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళ సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

**( సిరి న్యూస్) కొండాపూర్, ఏప్రిల్22:**



రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పాలకవర్గం నూతన పథకాలను ప్రవేశపెడుతుందని టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ మండలం తీర్పోల్, ఎదురూగూడెంలో నూతన రూ 20 లక్షల మహిళా సమైక్య భావనలకు సర్పంచ్ సత్యనారాయణతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలను ఫ్లెక్సీలలో, టీవీలలో యాడ్సులు వేసి మైకుల ముందు డబ్బా మాటలు చెప్పారు తప్ప డబుల్ బెడ్ రూములు అందించలేదని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి సంక్షేమ పథకాలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చి అర్హులైన ప్రతి ఒక్క లబ్దారునికి అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు హామీలను అమలుపరుస్తూ రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రూ 500 వంటగ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పావుల వడ్డీ రుణాలు, మహిళా సాధికారత పెంచేందుకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కృషి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు నాయకులు నరసింహారెడ్డి, గొల్లపల్లి మాజీ సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,వార్డు సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# డివిజన్ల రూపు రేఖలు మార్చాలి

- సిఎంసి కమిషనర్ కు వినతిపత్రం అందజేత
- ప్రజల పక్షాన కాట శ్రీనివాస్ గౌడ్ పోరాటం

**అమీన్ పూర్ ఏప్రిల్ 22 సిరి న్యూస్**





అమీన్ పూర్ బీరంగూడ డివిజన్లల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సిఎంసి కమిషనర్ కు కలిసి వినతి పత్రం అందజేసిన పటాన్ చేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**

అమీన్ పూర్ 271 మరియు 270 బీరంగూడ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న ప్రధాన సమస్యలను సిఎంసి కమిషనర్ కు వివరించడం జరిగిందని అన్నారు. డివిజన్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి, మరియు పారిశుద్ధ కార్మికుల కొరత లేకుండా చూడాలని ఆయన అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో లోతట్టు ప్రాంతాలు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు.వేసవి ఎండల తీవ్రత ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా టాంకర్ల ద్వారా లేదా, పైప్ లైన్ ల ద్వారా క్రమబద్ధంగా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అమీన్పూర్ ప్రధాన రహదారులు మరియు కాలనీలలో వెలగని వీధి దీపాలను తక్షణమే పునర్దించాలని, మరియు చీకటి వల్ల మహిళలు వృద్ధులు ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు. అంతర్గత రహదారులు గుంతల మయంగా మారిన అంతర్గత రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని లేదా కొత్త రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపేలా పర్యవేక్షించాలని ఆయన కోరారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాలో స్తంభించిన రవాణా !

- ఉదయం నుండి నిలిచిపోయిన బస్సులు
- ఇబ్బందులు పడ్డ కార్మికులు
- బలవంతంగా బస్సులను నడిపేందుకు పోలీసుల యత్నం
- అడ్డుకున్న కార్మికులు
- సంగారెడ్డి డిపోలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట




**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 22(సిరి న్యూస్):**

తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. యాజమాన్యంతో జరిపిన చర్చలు విఫలం కావ డంతో మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు ఉద్యోగుల జేఏసీ నాయకులు ప్రకటించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ఆర్టీసీ డిపోల్లో 1,043 మంది కండక్టర్లు ఉండగా 869 మంది డ్రై వర్లు ఉన్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్లారు. డిపోలలో కార్మికులు విధులు బహిష్కరించి డిపో గ్యారేజీల ఎదుట నిరసన తెలిపారు. అయితే ప్రయాణి కులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, తాత్కా లిక సిబ్బందిని నియమించి బస్సులు నడుపుతామని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ విజయ భాస్కర్ పేర్కొన్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ సమ్మె ప్రభావం కనిపించింది. ఎక్కడికక్కడ ఆర్టీసీ బస్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు ఆందోళన చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ డిపోల్లో సమ్మెలో వందలాది మంది పాల్గొన్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ బస్ డిపోల ఎదుట ఆర్టీసి కార్మికుల సమ్మె చేపట్టారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ బస్ డిపోల్లో ఆర్టీసీ కార్మికుల సమ్మెతో బస్సులు నిలిచిపోయాయి. ఇలావుండగా సంగారెడ్డి డిపోలో మహాలక్ష్మి మాత్రమే అనే బోర్డు ఏర్పాటు చేసి బస్సులను సంగారెడ్డి బస్టాండ్ నుండి నడిపారు. ప్రయాణీకులను ఎక్కించుకొని బస్సు రోడ్డుపైకి రావడంతో కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాగా పోలీసుల బందోబస్తు మధ్య బస్సును నడి పించారు.

**సంగారెడ్డి డిపోలో ఉద్రిక్తత..**

ఓవైపు ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల కోసం సమ్మె చేపట్టగా మరోవైపు హైర్ బస్సులను అధికారులు పోలీసుల సహాయంతో ప్రైవేట్ డ్రైవర్లతో నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. బస్సులను సంగారెడ్డి బస్టాండ్ నుండి ప్రయాణీకులను తరలించేందుకు బయటకు పంపించగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. బస్సులను కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను తొలగించేందుకు ప్రయత్నించగా కొద్దిసేపు వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ సమయంలోనే ఓ బస్సు టైర్ వాల్వ్ ను కార్మికులు విరగ్గొట్టి అడ్డుకున్నారు. ఈ తోపులాటలో ఓ కార్మికుడిపై పోలీసు చేయి చేసుకోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కార్మికులు వాగ్వివాదానికి దిగారు. కార్మికులంతా ఒక్కసారిగా రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారులు కార్మికులకు నచ్చజెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు.





# కానుకుంట రోడ్డుకు పనులకు మోక్షం

- కానుకుంట రహదారి అభివృద్ధికి రూ. 7.20 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 22 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మండల కేంద్రం నుండి కానుకుంట మీదుగా నూతనకల్ శివారు వరకు ఉన్న రహదారి మరమ్మ త్తులకు ప్రభుత్వం రూ. 7.20 కోట్లు మంజూరు చేసింది. సుమారు 8.2 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేపట్టనున్న ఈ రహదారి ఎన్నో సంవత్సరాలుగా దెబ్బతిన్న పరిస్థితిలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారిన నేపథ్యంలో ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసు కువచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి స్పందించి నిధులు మంజూరు చేయించగా, రోడ్లు,భవనాల శాఖ అధికారులు సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు. రహదారి పనులు పూర్తయితే కానుకుంటతో పాటు అనంతారం, నాగిరెడ్డిగూడెం, వీరారెడ్డిపల్లి, రామ్ రెడ్డి బావి గ్రామాల ప్రజలకు, అలాగే మేడ్చల్ మరియు మెదక్ జిల్లాల మధ్య ప్రయాణించే వారికి సౌకర్యం కలగనుంది. ఎట్టకేలకు కానుకుంట రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కానుకుంట రోడ్డుకు నిధులు మంజూరు పై హర్షం**

గుమ్మడిదల నుండి కానుకుంట మీదుగా నూతనకల్ వరకు రోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసిన పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు విషయమై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో స్పందించి నిధులు మంజూరు చేసినందున హర్షం వ్యక్తం చేశారు.

# రూయ్.. రూయ్... మంటు మైనర్ల చేతుల్లో బైకులు

- రోడ్లపై పెరుగుతున్న ప్రమాదాలు
- లైసెన్స్ లేకుండా డ్రైవింగ్

**గుమ్మడిదల,ఏప్రిల్ 22 (సిరి న్యూస్) :**



గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలో మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు నడపడం రోజురోజుకూ పెరుగుతోంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా రోడ్లపై బైక్‌లతో దూసుకెళ్తూ శబ్దాలు చేస్తూ తిరుగుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ఇది భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారి తీసే పరిస్థితిగా మారుతోంది.చిన్న వయసులోనే బైక్‌లు నడిపే అలవాటు పెరగడంతో, పిల్లలు ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకుండా అతివేగంతో ప్రయాణి స్తున్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, పరిమితి మించిన వేగంతో వెళ్లడం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు అధికమవు తున్నాయి. ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. తల్లిదండ్రుల నిర్లక్ష్యం కూడా ఈ సమస్యకు ప్రధాన కారణంగా మారుతోంది. పిల్లలు అడిగారని వెంటనే బైక్‌లు కొనివ్వడం, వారి ప్రవర్తనపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల వారు తప్పుదారిలోకి వెళ్లే ప్రమాదం ఉంది. మొదట వీధుల్లోనే నడిపిన పిల్లలు, ఆ తర్వాత ప్రధాన రహదారులపై కూడా వాహనాలు నడపడం గమనించదగ్గ విషయం. ఇక పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై కేసులు నమోదు చేస్తూ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రమాదాలను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. రోజుకోచోట ప్రమాదాలు జరుగుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సోషల్ మీడియా ప్రభావంతో యువతలో బైక్ రైడింగ్‌పై ఆసక్తి పెరగడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. స్పోర్ట్స్ బైక్‌ల వినియోగం పెరగడం ఈ పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మార్చుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి, పిల్లలకు వాహనాలు ఇవ్వడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

**పోలీసులు అవగాహన సదస్సులు పెడుతున్న**

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ లేనిదే వాహనం నడపరాదు అంటూ అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రజలలో మాత్రం చైతన్యం రావడం లేదు. తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ ప్రజలలో చైతన్యం తీసుక వస్తున్న ప్రజలలో మాత్రం మార్పు రావడం లేదు. ద్వారా మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడాలి.

**పిల్లలకు సూచనలు**

- డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాత మాత్రమే వాహనం నడపాలి.
- ఎప్పుడూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి
- అతివేగం, సెల్‌ఫోన్ ఉపయోగం పూర్తిగా నివారించాలి
- ట్రాఫిక్ నియమాలు పాటించడం

# నేటి నుంచి లక్ష్మీనారాయణుని బ్రహ్మోత్సవాలు

- బ్రహ్మోత్సవాలను ముస్తాబైన మారెపల్లి లక్ష్మీనారాయణ స్వామి ఆలయం.
- శ్రీ లక్ష్మీనారాయణ స్వామి మూలవిరాట్.
- మాజీ మంత్రి,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిపిల్ల ఎమ్మెల కేటీఆర్కు అవ్వాన పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు.
- కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కరపత్రాలను అం దజేస్తున్న భక్తులు.
- మాజీ మంత్రి హరిష్ రావు బ్రహ్మోత్సలకు రావాలనీ కరపత్రం అందజేస్తున్న నాయకులు.
- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య ఉత్సవాల కరపత్రంను అందించిన గ్రామయువకులు.
- ఎంపీ రఘునందన్ రావుకు కరపత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు





**కొండాపూర్,ఏప్రిల్ 22( సిరిన్యూస్)**

మారేపల్లి లక్ష్మీనారాయణస్వామి నవమ(9వ) వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 23 నుంచి 27 వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు అతిపురాతనమైన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రంగా లక్ష్మీనారాయ ణస్వామి కృప మహిమానిత్వమని భక్తుల నమ్మకం గా కొనసాగుతుంది. రోజుకు 5 నుంచి 10వేల మంది భక్తుల దర్శనర్థం ఏర్పాట్లతో ఆలయ బ్రహ్మోత్సవాలకు మ స్తాబు చేశారు. సంగారెడ్డి శ్రీ వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వర దాచార్యుల పర్యవేక్షణలో జరిగే ఉత్సవాలకు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

**పెద్ద ఏత్తున అవ్వాన కరపత్రాలు అందజేత..**


బ్రహ్మోత్సవాలకు రెండు వారాల ముందు నుంచి కరపత్రాలతో ప్రచారం ముమ్మరం చేశారు. రాష్ట్ర మంత్రుకు, ఎమ్మెల్యేలకు జిల్లా, మండల స్థాయి నాయకులకు, అధికారులకు, వివిధ గ్రామాల ప్రజలకు, బందువులకు ఉత్సవాలకు హాజరూ కావాలనీ పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అహ్వాన కరప్రతాలను గ్రామస్థులు ఉత్సవాలకు హాజరూ కావాలనీ పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అహ్వాన కరప్రతాలను గ్రామస్థులు మమేకమై అందజేశారు.

**ఆలయ విశిష్టత..**

ఉన్నది మారేపల్లి గ్రామంలో క్రీ.శ 11వ శతాబ్దంలో మహిమాన్విత లక్ష్మీనారాయ ణస్వామి ఆలయం వెల్లసినట్లు గ్రామస్తులు చెబుతారు.ఏకశిలపై లక్ష్మీనారాయణ స్వామి దేవతాల విగ్రహాలు ఉండటం విశేషం. పూర్వం కాముని చెరువు ఒడ్డున పశ్చిమ దిక్కున హనమాన్ మందిరం ప్రాతంలో ఉన్న మఅపల్లి పేరుతో ఉన్న గ్రామం ప్రకృతి వైపరీత్యాలకు ద్వంసమైంది చరిత్ర అధారాలు తెలుపుతున్నవి. అనంతరం అక్కడ కొందరు కాముని చెరువు దిగువన ఇండ్లను నిర్మించుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు గురైన ప్రజలను కాపాడేందుకు మానవ రూపంలో సహాయం అందించడానికి శ్రీ లక్ష్మీనారాయణస్వామి వెలసినట్లు పూర్వీకులు, పూరణ కథలు చెబుతున్నాయి..

**అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు..**

ప్రతి ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా భక్తులు నిర్వహిస్తారు. 23వ తేది గురువారం సంగారెడ్డి వైకుంఠపురం నుంచి రథంపై ఉత్స వమూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా భజన సంకీర్తన, ఆట పాటలతో మారేపల్లి లక్ష్మీనారాయణ ఆలయానికి తీసుకువస్తారు. అనంతరం మూడు రోజులపాటు అభిషేకం, తిరుపతి,నిత్యాఆరాధన,ప్రతిరోజు సాయత్రం తులాభారము, గ్రామం పురవీధులో పంచామృత కలశాల ఊరేగిం పు చేస్తారు. అగ్నిప్రతిష్ఠ, ద్వజారోహణం, లక్ష్మీనారాయణహోమం, తల్లిదండ్రుల పాదపూజ, సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, కుంకుమార్చన, పుష్పయాగం, కల్యాణం, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు 27వ తేది సోమవారం ముగుస్తాయి.ఉత్సవాలు మొదలు కళాకా రులచే భజన సంకీర్తనలు, దేవదేవుళ్ల భక్తి ప్రవచనాలు, ఉపదేశాలు, చిట్టికేల ఆటలతో కొనసాగిస్తారు గ్రామంలోని ఏ ఇంట్లో వంటలు చేయకుండా గ్రాస్థులకు, భక్తులకు, నిర్వహకులు ఏర్పాట్లు ఎళ్లవేళలా అన్నదాన ప్రసాద వితరణ జరిపిస్తారు.



## కాళేశ్వరం కేసులో న్యాయం గెలిచింది

- పీసీ ఘోష్ కమిషన్ పై హైకోర్టు తీర్పుకు హర్షం..
- మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి..

**మెదక్ ఏప్రిల్,22(సిరిన్యూస్)**



కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్లేనని పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలంలేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు గారిపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. అయితే న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని అన్నారు.తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు మాజీ మంత్రి హరీష్ రావు గారి ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు.కాళేశ్వరం అంశంలో కేసీఆర్ గారిపై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని తెలిపారు.

## ఉప్పరి దోమడుగులో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు

**సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డికి ఆహ్వానం**



**గుమ్మడిదల, ఏప్రిల్ 22 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని దోమడుగు మధిర గ్రామం అయిన ఉప్పరి దోమడుగులో సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఈ నెల 23వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు అభిశెట్టి ఆంజనేయులు తెలిపారు. సర్వ జీవులకు ప్రాణాధారమైన పవిత్ర గంగానదిని దివి నుంచి భూమికి తీసుకువచ్చిన మహోన్నత తపస్వి భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగీరథ మహర్షి చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృతికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. యువత ఆయన జీవితం నుంచి ప్రేరణ పొందాలని సూచించారు. ఈ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి హాజరుకావాలని సంఘం తరపున కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్



**ఆసిఫాబాద్ (సిరి న్యూస్):**

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్ , వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు , బాలకృష్ణ, సలం బీన్ అహ్మద్, మాజీ ఎ ఎం సి, సింగల్ విండో చైర్మన్ గంధం శ్రీనివాస్, అలీ బీన్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నీసార్ , దూడల అశోక్ లతో కలిసి ఆర్టీసీ కార్మికులు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్ష శిబిరానికి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూన్న ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కార్మికులు చేపడుతున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

## ఆర్టీసీ సమ్మెతో డిపోలో నిలిచిపోయిన బస్సులు

- సమ్మెతో ప్రయాణికులకు ఇబ్బందులు
- ప్రవేట్ వాహనాలను అందుబాటులో ఉంచిన అధికారులు

**నర్సాపూర్ ఏప్రిల్ 22 (సిరి న్యూస్)**



ఆర్టీసీ కార్మికుల డిమాండ్ లు పరిష్కరించాలని ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు పెండింగ్ లో ఉన్న బకాయిలు చెల్లించాలి, పని భారం తగ్గించాలని, జీతాలు పెంచాలని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బుధవారం నర్సాపూర్ డిపో పరిధిలో 112 మంది కార్మికులు విధులను బహిష్కరించి డిపో ముందు నిరసన చేశారు అనంతరం కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.మా డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు ప్రవేట్ వాహనాలను నడపవద్దని తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగాలకు రాకూడదని విజ్ఞప్తి చేస్తున్నారు ఈ సమ్మెతో నర్సాపూర్ బస్ డిపోలో 35 బస్సులు నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ ఉద్యోగులు కూలీలు విద్యార్థులు వ్యాపార నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమ్మెను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వాహనాల యజమానులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్డిఓ రామకృష్ణ**

ఆర్టీసీ సమ్మెతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రవేట్ వాహనాలను సిద్ధంగా ఉంచామని ప్రతి రూట్ లో రెండు నుంచి మూడు బస్సులు పంపించామని ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఉంటే మరో 10 బస్సులు సిద్ధంగా ఉంచామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, ఆర్ ఐ లు ఉన్నారు





## శ్రీ జగదాంబ మాత సంత్ సేవలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వానం

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,
- బిఆర్ఎస్ మండల నాయకులు

**శివంపేట ఏప్రిల్ 22( సిరి న్యూస్ )**



శివంపేట మండల కేంద్రంలోని భీమ్లా తాండ గ్రామపంచాయతీ పరిధిలోని శంకర్ తండాలో శ్రీ శ్రీ జగదాంబ మాత మరియు శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రికను నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మరియు మండల ప్రజా ప్రతినిధులు గిరిజన సోదరుల సమక్షంలో ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ జగదాంబ మాత శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దయతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. అనంతరం శ్రీ సేవాలాల్ జగదాంబ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 29-04-2026 బుధవారం రోజు నుండి 01-05-2026 శుక్రవారం రోజు వరకు వివిధ పూజా కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు మూడు రోజులపాటు అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, శివంపేట మండలం మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్, నర్సాపూర్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గౌర్రె వెంకట్రామిరెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యాదగౌడ్, భీమ్లా తండా మాజీ ఉపసర్పంచ్ విట్టల్ నాయక్, గిరిజన సోదరులు భీమ్లా, రవి భాస్కర్ దేవేందర్, మరియు శ్రీ జగదాంబ మాత శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడిపై దాడి చేసి హత్య

- ఇద్దరికీ జీవిత ఖైదు.
- 30.000 వేల రూపాయల జరిమాన.
- శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినంధించిన
- జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు.

**రామాయంపేట, ఏప్రిల్ 22(సిరి న్యూస్)**



మెదక్ జిల్లా రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన స్నేహితుడి హత్య కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు చెరో రూ.15,000 చొప్పున జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. పూర్తి వివరాలు వెల్లడిస్తూ డి. ధర్మారం గ్రామానికి చెందిన నరేందర్ తన స్నేహితులైన పిట్ల పరుశురాములు, చెవిటోల్ల చంద్రంతో కలిసి తరచూ మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో వారిమధ్య తలెత్తిన విభేదాలు తీవ్రమై, క్షణిక ఆవేశంలో నిందితులు నరేందర్ పై దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెక్ డ్యాంలో పడేసి ఘటనను దాచిపెట్టేందుకు ప్రయత్నించారు.ఈ ఘటన 2022 మే 4న వెలుగులోకి రావడంతో రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి చంద్రశేఖర్ రెడ్డి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి, సాక్షులను విచారించి నిందితులను అరెస్ట్ చేశారు. తదనంతరం పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సి.ఐ వెంకట రాజా గౌడ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితులు నేరం చేసినట్లు నిర్ధారించి ఇద్దరికీ జీవిత ఖైదుతో పాటు చెరో రూ.15,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ భూపాల్ సహకరించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## మెదక్ ఆర్టీసీ లో తాత్కాలిక ఉద్యోగావకాశాలు

- మెదక్ లో డ్రైవర్లు,నర్సాపూర్ లో తాత్కాలిక కండక్టర్ల నియామకానికి ఆహ్వానం
- మెదక్ డిపో మేనేజర్ సురేఖ

**మెదక్ ఏప్రిల్,22(సిరిన్యూస్)**

ఆర్టీసీ ఉద్యోగులు ప్రస్తుతం సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఉద్యోగ ఏర్పాట్లు చేపట్టమని,మెదక్ ఆర్టీసీ డిఎం సురేఖ ఒక ప్రకటన విడుదల చేశారు.మెదక్ డిపోలో తాత్కాలిక డ్రైవర్లుగా నియమించుకోవడానికి 18 నెలల హెవీ లైసెన్స్ ,అనుభవం ఉన్న వారు ఉదయం 5 గంటలకి మెదక్ డిపోలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.టిజిఎస్ ఆర్టిసి సేవలను కొనసాగించేందుకు పదో తరగతి ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులను నర్సాపూర్ డిపోలో తాత్కాలికంగా కండక్టర్లుగా నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయనీ నర్సాపూర్ లో తాత్కాలిక కండక్టర్ పోస్ట్ కు ఆసక్తి గల అభ్యర్థులు క్రింది అర్హతలు కలిగి ఉండాలన్నారు.

1) పదవ తరగతి ఉత్తీర్ణత సాధించినవారు.

2) ఆధార్ కార్డు మరియు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోస్ తో అభ్యర్థులు తమ బయోడేటా విద్యార్హత సర్టిఫికెట్తో ఉదయం 5 గంటలకు నర్సాపూర్ డిపో కార్యాలయం వద్ద సంప్రదించలన్నారు.ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా సేవలందించడం TGSRTC యొక్క ముఖ్య లక్ష్యం అని ఆమె పేర్కొన్నారు.



# పెళ్ళితో ప్రమాదం తప్పదంటున్న అధ్యయనం

'పెళ్ళి అనేది ఒక మహోన్నతమైన అంశం. ప్రతి ఒక్కరూ చేసుకోవాల్సింది. పెళ్ళి అనేది రెండు అక్షరాలు కాదు.. ఏడు జన్మల బంధం' ఇలా ఒక్కొక్కరు ఒక్కలా పెళ్ళి అన్న బంధానికి నిర్వచనాలు చెప్తుంటారు. మరికొందరయితే జీవితంలో మనతో చివరికి వరకు ఉండో తోడు అని కూడా అంటారు. దాదాపు ప్రతి ఒక్కరి దగ్గర 'పెళ్ళి' అన్న అంశానికి ఒక మధురమైన నిర్వచనం ఉంటుంది. కానీ తాజాగా శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనం మాత్రం 'పెళ్ళితో ప్రమాదం తప్పదు' అంటోంది. ఇంతకీ ఆ ప్రమాదం ఏంటా? అని ఆలోచిస్తున్నారా.. అదే 'డిమెన్షియా'. ఇదొక వ్యాధి. దీనినే తెలుగులో 'చిత్తవైకల్యం' అని కూడా అంటారు. ఈ వ్యాధి వచ్చిన వారు జ్ఞాపకశక్తి, ఆలోచన, భాష సహా ఇతర సామర్థ్యాలను కూడా కోల్పోతారు. వీటిలో కొత్త విషయాలను నేర్చుకోవడం కూడా ఒకటి. 'ది ఆల్జీమర్స్ అసోసియేషన్' పబ్లిష్ చేసిన ఈ జర్నల్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక చర్చలకు దారితీస్తోంది.

**పెళ్ళి అనేది మన మెంటల్ హెల్త్, జీవితం ఇలా ప్రతి అంశంపై పాజిటివ్ ప్రభావం చూపుతుంది అన్న వాదనలను ఈ జర్నల్ ఛాలెంజ్ చేస్తోంది. ఇన్నాళ్లూ 'పెళ్ళి' గురించి మన విన్నది, చదివింది అంతా కూడా అబద్ధమేనా.. పెళ్ళి అనేది 'మన్మథుడు' సినిమాలో చెప్పినట్లు నరకకూపమా? పెళ్ళంటే నూరేళ్ల పంట కాదు మంటా? అన్న అనుమానాలు యువతలో పెరుగుతున్నాయి. అంతేకాకుండా పెళ్ళి చేసుకోరా అంటూ ఒత్తిడి తెస్తున్న తల్లిదండ్రులకు ఈ జర్నల్ చూపించి మరీ యువకులు 'ఇప్పుడు చెప్పండి పెళ్ళి అవసరమా?' అని అడిగేలా పరిస్థితులు మారాయి. ఇంతకీ ఆ జర్నల్‌లో ఏముందుంటే..**



2019లో చేసిన ఒక స్టడీ.. పరిశోధన జరుగుతున్న సమయంలో పెళ్ళి అయిన వారికంటే కాని వాళ్లలోనే 'డిమెన్షియా' వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. కానీ ఇప్పుడు తాజాగా చేసిన స్టడీ పాత స్టడీకి పూర్తి విరుద్ధమైన ఫలితాలను బయటపెట్టింది. ఈ కొత్త స్టడీ కోసం శాస్త్రవేత్తలు 18ఏళ్ల వయసు నిండిన అమెరికన్లను 24వేల మందిని పరిశీలించింది. దీని ప్రకారం పెళ్ళి అనేది మన మెదడుపైన చెడు ప్రభావం చూపుతుందని చెప్తోంది.

**"ప్రతి రిలేషన్‌కి ఒక ప్రత్యేక ఎమోషనల్ ఎకోసిస్టం ఉంటుంది. కేవలం పెళ్ళి చేసుకోవడం వల్ల అభిజ్ఞ(కాగ్నిటివ్) సమస్యల నుంచి ఒక వ్యక్తి రక్షించబడడు. చాలా కాలంగా సోషల్ ఇంటరాక్షన్ ఈ కాగ్నిటివ్ సమస్యల నుంచి రక్షించాయని భావిస్తూ వచ్చారు. కానీ అది అంత ఈజీ కాదు. అంతేకాకుండా పెళ్ళి అనేది రిస్క్ అని కూడా మా స్టడీ పక్కాగా చెప్పట్లేదు. కానీ పెళ్ళి అనేది మాత్రం మన అనుకుంటున్నంత ప్రొటెక్టివ్ అయితే కాదు. మా స్టడీ మిక్స్‌డ్ రిజల్ట్స్‌ను ఇచ్చింది" అని గ్లెనెగల్స్ బీజీఎస్ హాస్పిటల్‌లోని న్యూరాలజిస్ట్ కన్సల్టెంట్ అవినాష్ కులకర్ణి చెప్పారు.**



**అంతేకాకుండా అమెరికన్లపై చేసిన స్టడీ ఫలితాలను భారతీయులపై రుద్దడంపై కూడా ఆయన స్పందించారు. "ఇండియాలోని వివాహితల్లో డిమెన్షియా చాలా సాధారణ సమస్యగా ఉంది. మరీ ముఖ్యంగా ఫ్యామిలీ కోసం అని చెప్పి తమ గోల్స్, కెరీర్‌లను చెత్తబుట్టలో పడేసి హౌస్‌వైఫ్‌గా జీవనాన్ని వెళ్లదీస్తున్నారో.. వారిలో ఈ సమస్య మరింత అధికంగా ఉంది. దీని ప్రకారం చూసుకుంటే వైవాహిక బంధంలో తెలియని అసంతృప్తి, ఫుల్‌ఫిల్‌మెంట్ లేకపోవడం ఈ సమస్యకు దారితీయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది" అని కులకర్ణి వివరించారు.**

ఈ అంశంపై యశోధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని న్యూరాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ లవ్ బంన్సల్ కూడా స్పందించారు. డైమెన్షియా అనేది పెళ్ళి వల్ల రాదని అన్నారు. ఆ పెళ్ళి అయిన తర్వాత సదరు వ్యక్తి గడుపుతున్న జీవితం దీనిని ప్రభావితం చేస్తుందని చెప్పారు. "పెళ్ళి అనేది డిమెన్షియాకు ప్రధాన కారణం కాదు. పెళ్ళి తర్వాత గడిప జీవతంలోని ఒత్తిడి, జీవనవిధానం, మానసిక ఆరోగ్యం ఇలా ప్రతి అంశం మన మెదడు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది'' అని పేర్కొన్నారు. ఈ స్టడీని ప్రధానంగా మనం మన జీవన విధానం, దాని క్వాలిటీకి అన్వయించుకోవాలే తప్ప దీనిని పెళ్ళికి మాత్రమే ముడిపెట్టుకోవద్దని అన్నారు.

# రిచ్‌గా కనిపించాలంటే బ్రాండెడ్ వస్తువులే అక్కర్లేదు..!

ఎవరమైనా ట్రెండీగా, ఫ్యాషనబుల్‌గా, రిచ్‌గా కనిపించాలని అనుకుంటాం. కానీ అలా కనిపించాలంటే బ్రాండెడ్ దుస్తులే వేయాలన్న అపోహ కూడా చాలా మందిలో పాతుకుపోయి ఉంది. కాస్తంత తక్కువ ధర దుస్తులు వేస్తే మనం స్టైల్‌గా, రిచ్‌గా కనిపించమని అనుకుంటారు. అందుకే చాలా మంది జేబులు ఖాళీ అవుతున్నా బ్రాండెడ్ వస్తువులకే ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ ఫ్యాషన్ ఎక్స్‌పర్ట్స్ మాత్రం ఇది అపోహ మాత్రమే అని కొట్టిపారేస్తున్నారు. బ్రాండెడ్ వస్తువుల వల్ల జేబులు చిల్లులు పడటం తప్ప మరేమీ ఉండదంటున్నారు. సాదాసీదాగా మనకు పాకెట్ ఫ్రెండ్లీగా లభించే వస్తువులతో కూడా మనం ఫ్యాషన్, రిచ్, స్మార్ట్‌గా కనిపించొచ్చని చెప్తున్నారు. నిజానికి రిచ్ లుక్ అనేది వేసుకునే దుస్తులు, వాడే వస్తువుల ధర మీద ఆధారపడదు. వాటిని ఉపయోగించే వ్యక్తిలో ఉండే ఆత్మవిశ్వాసం, సెలెక్షన్, నీట్ ప్రజెంటేషన్ ఉంటే చాలంటున్నారు నిపుణులు. వీటన్నిటితో పాటు తక్కువ ఖర్చుతో రిచ్‌గా, ఫ్యాషనబుల్‌గా ఎలా కనిపించాలో ఇక్కడ కొన్ని చిట్కాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.

### సెలక్షన్ ముఖ్యం

**ఒక బ్రాండెడ్ లోగో కలిగిన ఖరీదైన డ్రెస్ వేసుకున్న వారికన్నా, చక్కగా ఐరన్ చేసి వేసుకున్న ప్లెయిన్, లైట్ కలర్ డ్రెస్ వేసుకున్న వాళ్లు చాలా చక్కగా, ఆకర్షణీయంగా కనిపిస్తారు. ఎందుకంటే ఫ్యాషన్ ఫాలో అవడం అంటే బ్రాండెడ్, లగ్జరీయస్ వస్తువులు, దుస్తులను ఎక్కువ ఖర్చు చేసి కొనడం కాదు. మనలో ఉన్న ఎంపిక జ్ఞానాన్ని ఉపయోగించడం. అంటే మన సెన్స్ ఆప్ సెలక్షన్ ను సరిగ్గా ఉపయోగించడమే.**

### రిచ్‌గా కనిపించచ్చు

చాలా మంది మిడిల్ క్లాస్ వాళ్లు చూడటానికి చాలా రిచ్ గా, హుందుగా కనిపిస్తారు. ఎందుకుంటే వారి సెలక్షన్ అలా ఉంటుంది. వారు జారా, మ్యాంగో, ఎల్వీ లాంటి బ్రాండ్లను ఉపయోగించకుండానే అందిరినీ ఆకట్టుకునేలా కనిపిస్తారు. ఎలాగంటే..

**బ్రాండ్ వాడకుండానే రిచ్‌గా, హుందాగా కనిపిచాలంటే ఎల్లప్పడూ మృదువైన లేత రంగులను ఎంచుకోవాలి.**

- **అలాగే గ్లిట్టర్ కలిగనవి కాకుండా మ్యాటీ ఫినీష్ ఫ్యాబ్రిక్‌స్‌ని ఎంచుకోవాలి.**
- **నెట్టెడ్ డ్రెస్సులకు బదులుగా మృదువైన దుస్తులను వేసుకోవాలి.**
- **ఎక్కువగా అలంకరించుకోకుండా సింపుల్ గా రెడీ అవాలి. వేసుకన్న ఒకటి రెండు వస్తువులు అయినా రైట్ ఛాయస్ అయి ఉండాలి. అన్నింటికీ మించి ముఖంలో నవ్వు ఉండాలి. అదే అన్నింటికన్నా మంచి లుక్ ని ఇచ్చేది.**






### తక్కువ ఖర్చుతో ఎలాగంటే..

- **ఫ్యాషన్ భాషలో రిచ్ అంటే డబ్బు, బ్రాండ్ కాదు సెన్స్ ఆఫ్ సెలక్షన్ అండ్ ప్రజెంటేషన్. మన దగ్గర న్న రూ. 500 డ్రెస్‌ని కూడా రూ.5000దానిలా కనిపించేలా చేయగలిగితే... అదే ఫ్యాషన్ సెన్స్. ఇందుకు ప్రత్యేకంగా ఏమీ చేయవల్సిన అవసరం లేదు . మీరు ఎంచుకునే వాటిలో చిన్న చిన్న మార్పులు చేస్తే చాలు..**
- **ప్లెయిన్, సాఫ్ట్ కలర్స్ దుస్తులు: ముదురు రంగులు ఎప్పడూ చూడగానే అతిగా, ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. లేత రంగులు ధరిస్తే అందిరనీ ఆకర్షించేలా ఉంటారు.**
- **ఫ్యాబ్రిక్ చాలా ముఖ్యం: రిచ్ గా కనిపించాలంటే కాటన్, లినెన్ వంటి మెత్తటి దుస్తులను శ్రద్ధగా ఎంచుకోండి.**
- **శుభ్రంగా కనిపించే చెప్పలు: మీరు వేసుకునే షూ లేదా చెప్పల మీద మరకలు, మట్టి వంటివి లేకుండా నీట్ గా, శుభ్రంగా ఉండేలా చూసుకోండి.**
- **సింపుల్ లుక్ : రిచ్‌గా కనిపించాలంటే అన్నీ బ్రాండెడ్ వస్తువులే ధరించాల్సిన అవసరం లేదు. సింపుల్‌గా అలిగెంట్‌గా కనిపించే వాచీ, చైన్ వంటివి కూడా మీ లుక్ ను డబుల్ చేస్తాయి.**
- **సహజమైన సౌందర్యం: మేకప్ లిప్ స్టిక్ వంటివి వేసుకోకుండా సహజంగా, అందంగా కనిపించడమే అసలైన రిచ్‌నెస్.**
- **ముఖం మీద చిరునవ్వు: ఎన్ని కోట్ల రూపాయలతో కొన్న దుస్తులు, వస్తువులు మీ దగ్గరనున్నా మీ ముఖం మీద చిరునవ్వు లేకపోతే అవన్నీ వృథా.**
- **బాడీ లాంగ్వేజ్: రిచ్ గా, స్టైల్ గా కనిపించాలంటే బయట కనిపించే వాటికన్నా లోపలున్న మీ ఆత్మవిశ్వాసం, నమ్మకం వంటివి చాలా ముఖ్యం. మీ శరీర భాష మీ లుక్ పూర్తిగా మార్చేస్తుంది?**
- **మాట తీరు: ఎదుటి వ్యక్తితో మీరు మాట్లాడే తీరు, పద్ధతి కూడా మిమల్ని రిచ్‌గా చూపిస్తాయి.**

**ఇవేవీ బ్రాండ్ కాదు కానీ ఇవి మీకు క్లాసీ, రిచ్ లుక్ ఇస్తాయి. మీ మొత్తం పర్సనాలిటీని ఇవి షైన్ చేస్తాయి. ఇవి దుస్తులకన్నా ఎక్కువగా ఇంప్రెస్ చేస్తాయి.**

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.